● కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.

## కల



ఏమేవ్!

ఏమండీ!

తెల్లవారబోతోంది, . లేచి ఆ సందె పొద్దులకాడ సంపంగి పాట కేసెట్ పెట్టు అన్నాడు భర్త సుబ్బారావు.

అదేం పాడుబుద్ధండీ, ప్రొద్దున్నే ఎవరైనా సుప్రభాతం వింటారు కానీ అంది రాధ.

నాకు పొద్దున్నే ఆ పాట వింటేగాని లేవబుద్ధి కాదుగానీ వెళ్లి పెట్టు అన్నాడు. పాట వినుకుంటూ చాలా హుషారుగా లేచాడు సుబ్బారావు. వ్యాయామం, నిత్యకృత్యాలు అయ్యాక ఆఫీసుకు బయలుదేరి వెళ్ళాడు.

రాధ ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టింది కాబట్టి ఇంటిపనంతా తన భర్తే చేస్తాడు కాబట్టి మెల్లిగా వెళ్ళి టీవీ ఆన్ చేసింది. అందులో ఓ మంచి తెలుగు కుటుంబ కథా చిత్రం వస్తూంది. కానీ అది తనకి నచ్చలేదు. ఎందుకంటే అందులో భార్య ఇంటిపని, అన్ని పనులు చేసుకుంటుంటే భర్త హాయిగా ఎంజాయ్ చేస్తుంటాడు కాబట్టి.

సాయంత్రం ఆరు కాగానే సుబ్బారావు రాధా అనుకుంటూ వచ్చాడు.

ఏవండీ అని ఎదురుగా వెళ్లింది రాధ.

వెళ్ళి కాస్త మంచి భక్తి పాట గాని, భజన కేసెట్ కాని పెట్టవే విందాం అన్నాడు.

అదేమండి ఈ వేళప్పుడు ఎవరైనా మంచి రొమాన్స్ పాట గాని, లవ్ పాట గాని వింటారు మీరూ అంది.

నువ్వెళ్లి చెప్పిన పని చెయ్యి అన్నాడు.

రాత్రి భోజనాలయ్యాక పడక వద్దకు చేరుకున్నారిద్దరు.

ఏవండీ అని రాధ కాస్త దగ్గరగా జరిగింది.

ఈరోజు గురువారం మూడ్ రాదు పడుకో అన్నాడు.

ఈయనేం వింత ప్రవర్తన గల భర్తరా బాబో అని పడుకుంది రాధ.

రాధా! రాధా! లేవవే అని పిలుపు వినిపించేసరికి లేచి కూర్చుంది రాధ.

టైం చూసుకో ఎంతయిందో, ఏం ఏదైనా కలలుకన్నావా అంది తల్లి.

అవును ఒక పాడుకల అంది రాధ.

—మహ్మద్ ఆసీఫ్



## నిరుద్యోగి

దారిలో కనబడిన ఓ హోటల్‌లోకి అడుగుపెట్టాను. టిఫెన్‌కి ఆర్డరిచ్చాను. సర్వర్ టిఫెన్ తెచ్చి టేబుల్‌మీద పెట్టాడు. నిదానంగా తింటూ ఆలోచిస్తున్నాను.

'బిల్ చెల్లించకుండా బయటపడాలి ఎలా?' ఆలోచిస్తుంటే ఒళ్ళంతా చెమటలు పడుతోంది. శరీరం వణుకుతోంది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. క్యాషియర్ వైపు చూశాను. డబ్బులు తీసుకుంటూ మధ్యమధ్యలో పేపర్ తిరగేస్తున్నాడు.

ప్రవేశద్వారం పక్కగా ఛెయిర్‌లో కూర్చుని వున్న కేషియర్ యమధర్మరాజులా కనిపించాడు. 'అతని దృష్టినుంచి ఎలా తప్పకోవాలి?'. అనుకుంటూ లేని ధైర్యం కూడగట్టుకోసాగాను. తినడం పూర్తయిన వారు బిల్ చెల్లించి బయటకెళ్తున్నారు. పిచ్చిచూపులు చూస్తూ మెల్లిగా తింటున్నాను. సర్వర్ వచ్చి 'కాఫీ.. టీ.. ఏమన్నా కావాలా సార్!' అంటూ అడిగాడు.

వద్దని తలూపాను. బిల్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

బిల్ · కాలనాగులా కనిపిస్తోంది. మలేరియా రోగిలా శరీరం వణుకుతోంది. కుంభకోణాల గురించి పేపర్లలో ఎన్నో సంవత్సరాల నుంచి చూస్తున్నాను. ఓ పూట తిన్నదానికే బిల్లు ఎగ్గొట్టాలంటే దడగా వుంది. ఈ నాయకులు కోట్లకు కోట్లు ఎలా తింటారో!? తల్చుకుంటేనే ఆశ్చర్యమేస్తుంది.

ఆ సమయంలో వంటవాడు దేవుడిలా వచ్చి క్యాషియర్‌తో ఏదో చెప్పాడు. క్యాషియర్ వెంటనే లేచి వంటగదిలోకెళ్ళాడు. ఏదో పనిమీద లోపలికెళ్ళినట్టున్నాడు. క్షణాల్లో తిరిగిరావచ్చు. త్వరపడాలి. అవకాశం మళ్ళీ రాదనుకుంటూ మిగిలిన టిఫెన్ ఆత్రుతగా నోటకుక్కుకుని మింగేశాను. చేతులు కడుక్కుని చుట్టూ దొంగచూపులు చూశాను. ఎవరూ నన్ను గమనించడం లేదు. సర్వర్‌లు తమ పనిలో తామున్నారు. మెల్లిగా లేచి గుండెను పిడికిట పట్టుకుని నడిచి బయటపడ్డాను.

సర్వర్లు గమనించి పిలుస్తారేమోనని వేగంగా కొంతదూరం నడిచి ఊపిరి పీల్చుకున్నాను.

నిన్నటి దినం నుంచి తిండిలేని కడుపు కొంతవరకు తృప్తిపడింది.

జేబులో ఓ మూల ముడుచుకుని వున్న ఐదు నోటు బయటకు తీశాను. నిన్న పేపర్లో చూసిన ప్రకటనకు ఈ రోజయినా అప్లయ్ చేయాలి అనుకుంటూ ముందుకు నడిచాను.

తినీతినక సంపాదించిన కొంత సొమ్మూ అప్లికేషన్లు పంపడానికే ఖర్చుపెడుతున్న నిరుద్యోగిని నేను.

—డి.కె. చదువులబాబు